సాక్షి
మహబూబాబాద్
సోమవారం ¦ 24 ¦ ఏప్రిల్ ¦ 2023



రక్షకదళంలో నారీమణులు

ములుగు జిల్లాలో మహిళా రక్షక భటులే ఆ ప్రాంతానికి రక్షణ కవచంలా మారారు. అన్నల ఇలాఖా మహిళా పోలీసులకు అడ్డాగా మారింది.

- 8లో▸



బాల బాలికలకు విముక్తి

హైదరాబాద్‌లోని వివిధ పరిశ్రమల్లో పని చేయించేందుకు బాలబాలికలను తరలిస్తున్నారనే సమాచారంతో రైల్వే పోలీసులు దాడులు చేసి వారికి విముక్తి కలిగించారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
39.6^0 /22.5^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అన్నదాతలు అధైర్యపడొద్దు

- కలెక్టర్ శశాంక



మహబూబాబాద్: అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని కలెక్టర్ శశాంక అన్నారు. ఆదివారం కలెక్టర్‌క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టించి పండించిన పంట వర్షపునీటిలో కొట్టుకుపోవడం బాధాకరమన్నారు. కోతకొచ్చిన మామిడి పంట నేల రాలిందని, అధికారులు త్వరితగతిన నివేదికలు రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలోని మరిపెడ, నెల్లికుదురు, నర్సింహులపేట, చిన్నగూడూరు మండలాల్లో ఎక్కువగా పంటలు దెబ్బతిన్నట్లు సమాచారం ఉందన్నారు. వ్యవసాయ సంబంధిత అధికారులందరూ క్షేత్రస్థాయిలో పంటలను సందర్శించి వాస్తవ నివేదికలు సమర్పించాలన్నారు. పంటలను కోల్పోయిన రైతులకు ధైర్యం చెప్పాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీఓలు కొమురయ్య, రమేష్, డీఏఓ ఛత్రు నాయక్, జిల్లా ఉద్యాన వన అధికారి సూర్య నారాయణ, నాలుగు మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి



గార్ల: అకాల వర్షంతో పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారం చెల్లించాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాలోత్ సురేష్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అకాల వర్షంతో ఆరబోసిన ధాన్యం తడిసిందని, మామిడి తోటల్లో ఈదురు గాలులకు మామిడికాయలు నేలరాలడంతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు సర్వే చేపట్టి పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారం వచ్చేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా, మండల నాయకులు తరుణ్, ఉదయ్, అనిల్, శివ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరాలయంలో భక్తుల సందడి



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల భక్తులు తరలి వచ్చారు. ముందుగా త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. గోదావరి మాతకు సైకిత లింగాలతో పూజలు చేసి దీపాలు వదిలారు. అనంతరం స్వామివారి గర్భగుడిలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయంలో మహిళలు కుంకుమార్చన పూజలు చేశారు. దీంతో ఆలయ పరిసరాలు, గోదావరి తీరంలో భక్తుల కోలాహలం కనిపించింది.

ఎవరెస్ట్ పర్వతారోహణకు యశ్వంత్ నాయక్



మరిపెడ రూరల్: ఇప్పటికే పలు పర్వతాలను అధిరోహించి అరుదైన రికార్డులు నెలకొల్పిన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యాతండాకు చెందిన మౌంటనర్ భూక్యా యశ్వంత్‌నాయక్ ప్రపంచంలోనే ఎత్తైన ఎవరెస్ట్ పర్వతారోహణకు ఎంపికయ్యాడు. ఎస్ఆర్ సాఫ్ట్‌వేర్ సొలిషియ ప్రైవేట్ లిమిటెడ్ వారు స్పాన్సర్‌షిప్ ఇచ్చి ఎంపిక చేసినట్లు మౌంటనర్ ఆదివారం తెలిపాడు. ఈ నెల 30న బేస్ క్యాంపునకు వెళ్లనున్నాడు. అనంతరం ఆగస్టులో నేపాల్‌లోని 8,848.86 మీటర్ల ఎత్తులో ఉన్న ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించనున్నట్లు యశ్వంత్ తెలిపాడు. భారతదేశ ఖ్యాతిని చాటుతున్న తమ కుమారుడికి ప్రభుత్వ పరంగా సాయం అందించాలని యశ్వంత్ తల్లిదండ్రులు రాముల్నార్తి–జ్యోతి వేడుకుంటున్నారు.

ఆరోగ్య సమస్యలు

- 'ఆరోగ్య మహిళ' కార్యక్రమంతో వెలుగులోకి..
- పరీక్షించిన మహిళల్లో 43శాతం మందికి హెల్త్ ప్రాబ్లమ్స్
- మెరుగైన చికిత్స కోసం రెఫర్
- ముందస్తు గుర్తిస్తే ఉత్తమ వైద్య సేవలు



కురవి పీహెచ్‌సీలో మహిళలకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

సాక్షి, మహబూబాబాద్: మగవారితో పోలిస్తే ఆడవారిలో ఆరోగ్య సమస్యలు ఎక్కువ. ఈ మేరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా ఆడవారిలోని ఆరోగ్య సమస్యలు బయటపడుతున్నాయి. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే వైద్యులు మెరుగైన వైద్యం కోసం వారిని పెద్ద ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఐదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో నిర్వహించిన పరీక్షల్లో 43శాతం మంది మహిళలు పలు రకాల ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తేలింది. అయితే జిల్లా వ్యాప్తంగా పరీక్షలు నిర్వహిస్తే.. పరీక్షించిన వారిలో సగం మందికి ఆరోగ్య సమస్యలు ఉండే అవకాశం ఉందని డాక్టర్లు చెబుతున్నారు.

43 శాతం మందికి సమస్యలే..

జిల్లాలోని మహిళా డాక్టర్లు ఉన్న అయోధ్యపురం, గంగారం, కురవి, దంతాలపల్లి, తొర్రూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మార్చి 8వ తేదీ నుంచి ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రతీ మంగళవారం మహిళలకు పరీక్షలు నిర్వహించి వారిలో ఆరోగ్య సమస్యలను తెలుసుకుంటున్నారు. అనుమానం వచ్చిన వారి షాంపిల్స్‌ను మహబూబాబాద్‌లోని టీ–హబ్‌కు పంపిస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు ఐదు పీహెచ్‌సీల నుంచి 1,717మందిని పరీక్షించారు. వీరిలో 737మందికి అంటే 43శాతం మందికి వివిధ ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వీరిలో అత్యధిక మంది గర్భాశయ సమస్యలతో బాధపడుతున్నవారు ఉండడం గమనార్హం. ఈ లెక్కన జిల్లాలోని మిగిలిన పీహెచ్‌సీల పరిధిలో కూడా పరీక్షలు నిర్వహిస్తే ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వేల సంఖ్యల్లో ఉండే అవకాశం ఉందని డాక్టర్లు చెబుతున్నారు.

మెరుగైన వైద్యం..

చాలా మంది మహిళలు తమకున్న ఆరోగ్య సమస్యలను కుటుంబ సభ్యులకు చెప్పడం లేదు. అలాగే ఆస్పత్రుల్లో చూపించుకునేందుకు నిర్లక్ష్యం చేస్తుంటారు. రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, మూత్ర సంబంధిత వ్యాధులు, మోనోపాజ్ సమస్యలు, పీసీఓడీ, ఎస్‌టీడీ వంటి ఆరోగ్య సమస్యలు ఇతరకులకు చెప్పుకోలేరు. దీంతో ఈ వ్యాధులు ముదిరిన తర్వాత చికిత్స చేయడం ఇబ్బందికంగా మారుతోంది. అయితే ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచలు, ఆశ కార్యకర్తలు, పట్టణ ప్రాంతాల్లో మెప్మా ఆర్పీలు మోటివేషన్‌తో మహిళలు ప్రతీ మంగళవారం పరీక్షలు చేయించుకునేందుకు వచ్చే అవకాశం ఉంది. దీంతో ఆరోగ్య సమస్యను ముందుగానే గుర్తించి మెరుగైన వైద్యం అందించే అవకాశం ఉంది.

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటి వరకు ఐదు పీహెచ్‌సీల్లో ప్రతీ మంగళవారం మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. దశల వారీగా జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో అమలు చేస్తాం. పరీక్షలు నిర్వహించి సమస్య ఉన్న వారికి స్థానిక ఆస్పత్రుల్లో, అంతకన్న పెద్ద సమస్య ఉంటే ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ ఆస్పత్రిలో, క్యాన్సర్ వంటి వ్యాధులకు హైదరాబాద్‌లో చికిత్స అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఏమాత్రం అనుమానం వచ్చినా పరీక్ష చేయించుకోవాలి.

డాక్టర్ ఉమాగౌరి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

కేసముద్రం మార్కెట్‌లో వరదనీటిలో కొట్టుకుపోతున్న మక్కలను దగ్గరకు చేరుస్తున్న రైతులు



కన్నీళ్లు మిగిల్చిన వాన..

- అకాల వర్షంతో కొట్టుకుపోయిన మక్కలు

కేసముద్రం: ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతులకు అకాలవర్షం కన్నీళ్లను మిగిల్చింది. ఒక్కసారి వర్షం పడడంతో మక్కలు వరదనీటిలో కొట్టుకుపోయిన సంఘటన కేసముద్రం మార్కెట్‌లో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. చుట్టుపక్కల గ్రామాల రైతులు మక్కలను మార్కెట్‌కు తీసుకువచ్చారు. షెడ్లు నిండిపోవడంతో ఓపెన్‌యార్డులో ఆరబోసుకున్నారు. ఈ క్రమంలో అకాల వర్షం కురవగా.. మక్కలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. రైతులు టార్పాలిన్లు కప్పే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మక్కలు తడిసిముద్దయ్యాయి. వరదనీటిలో కొట్టుకుపోయిన మక్కలను దగ్గరకు చేరుస్తూ రైతులు తీవ్ర ఆవేదన చెందారు. మార్కెట్‌లో సుమారు 2వేలకుపైగా బస్తాల మక్కలు అకాల వర్షంతో తడిశాయి. అదే విధంగా పలు గ్రామాల్లో కల్లాల వద్ద ఆరబోసుకున్న ధాన్యం, మక్కలు తడిసిముద్దయ్యాయి.

అంధకారంలో ఏజెన్సీ

కొత్తగూడ: అకాల వర్షానికి మండలంలోని పలు చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో మండలంలో అంధకారం అలుముకుంది. కొత్తగూడ నుంచి గంగారం మండలానికి విద్యుత్ సరఫరా అయ్యే లైన్‌పై చెట్లు విరిగి పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కాగా ట్రాన్స్‌కో సిబ్బంది లైన్ పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇదిలా ఉంటే వర్షానికి పలు చోట్ల వరిపొలాలు నేల వాలినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షానికి గాదె వాగు ఉధృతంగా ప్రవహించి నర్సంపేట నుంచి వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.



మార్కెట్‌లో వర్షపు నీటిలో మక్కలు



కొత్తగూడలో విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి

- కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి



ఆనెపురంలో రాలిన మామిడి కాయలను పరిశీలిస్తున్న అన్వేష్‌రెడ్డి

మరిపెడ రూరల్: అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. మరిపెడ మండలంలోని స్టేజితండా, ఆనెపురం, వెంకట్‌తండాలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, డోర్నకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంచంద్రునాయక్‌తో కలిసి ఆయన ఆదివారం పర్యటించారు. అకాల వర్షానికి దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, మామిడి, మిర్చి పంటలను వారు పరిశీలించారు. అనంతరం అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల వరుసగా కురుస్తున్న వడగండ్ల వానలు రైతులను కోలుకోలేని దెబ్బతీశాయన్నారు. శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి వరి, మొక్కజొన్న పంటలు నేలపాలయ్యాయని వాపోయారు. ప్రభుత్వం తరఫున అధికారులు కనీసం పంట క్షేత్రాలను పర్యవేక్షించి దెబ్బతిన్న పంటల సర్వే చేయకపోవడం దారుణమన్నారు. గత నెలలో కురిసిన వర్షానికి 2.20 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని స్వయంగా ప్రకటించిన ప్రభుత్వం, వెంటనే మాటమార్చి 1.50లక్షల ఎకరాల్లోనే పంట నష్టం జరిగిందని చెప్పడం రైతులను మోసం చేయడమేనన్నారు. రాష్ట్రంలో 11వేల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్న ప్రభుత్వం, ఎక్కడ కూడా ధాన్యం కొనుగోళ్లు జరపకపోవడం విడ్డూరమన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆయన ధ్వసమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అకాల వర్షాలతో నష్టపోయిన రైతంగాన్ని తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా బాధిత రైతులతో కలిసి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు తోట వెంకన్న, దేవేందర్, నాయకులు గుగులోతు రవినాయక్, పెద్దబోయిన ఐలయ్య, తాజొద్దీన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంతోనే బతుకులు బాగుపడుతాయి

- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క
- కమలాపూర్‌కు చేరుకున్న 'పీపుల్స్‌మార్చ్'
- ప్రజల సమస్యలు తెలుసుకుంటూ సాగిన పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

కమలాపూర్: ఇందిరమ్మ రాజ్యంతో మన బతుకులు బాగుపడుతాయని సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఆదివారం మధ్యాహ్నం కరీంనగర్ జిల్లా నుంచి హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం భీంపల్లి గ్రామంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, మహిళలు మంగళహారతులు, బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు. రహదారుల వెంట తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన భట్టి.. భీంపల్లి, ఉప్పల్, కమలాపూర్ గ్రామాల్లో 16 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేపట్టారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజల ఆకాంక్షను గౌరవించి వారి లక్ష్యాలను నెరవేర్చడానికి సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిందని, నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం కేవలం ఇందిరమ్మ రాజ్యం ద్వారానే సాధ్యం అవుతాయన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, రైతులందరికీ ఏకకాలంలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ, పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని చెప్పారు. నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించి.. రేషన్ కార్డుపై తొమ్మిది రకాల సరుకులు, రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామన్నారు. వ్యవసాయం మీద పెట్టిన పెట్టుబడికి సగం లాభంగా కలిపి మద్దతు ధర ప్రకటిస్తామని, నిరుద్యోగ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలిస్తామని చెప్పిన భట్టి.. అంతవరకు నిరుద్యోగ భృతి అందజేస్తామని హామీ ఇచ్చారు. స్వశక్తి సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇస్తామన్నారు. కేసీఆర్ కుటుంబ పాలనకు చరమగీతం పాడి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తేనే ఇవన్నీ సాధ్యమవుతాయని వివరించారు. ఈ సందర్భంగా భీంపల్లిలో బింకూరి కుమార్ ఆయనకు గొంగడి కప్పి గొర్రెపిల్లను బహూకరించారు. పాదయాత్ర అనంతరం రాత్రి కమలాపూర్‌లో బస చేశారు. కార్యక్రమాల్లో హనుమకొండ, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బల్మూరి వెంకట్, మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు ఫక్రుద్దీన్, మండల నాయకులు చరణ్‌పటేల్, బాలసాని రమేష్‌గౌడ్, శివకుమార్, మేడిపల్లి సత్యం, తౌటం రవీందర్, దేశిని అయిలయ్య, పోడేటి భిక్షపతి, కనుకరత్నం, ప్రసాద్, సముద్రాల కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి



మాట్లాడుతున్న వేముల వెంకన్న

దంతాలపల్లి: పద్మశాలీలు తమ హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షులు వేముల వెంకన్న అన్నారు. మండలం కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పద్మశాలీలను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు పద్మశాలీలకు జనాభా ప్రాతిపదికన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సీట్లు కేటాయించి టికెట్లు ఇవ్వాలన్నారు. అలాగే రాష్ట్రంలో ప్రతి మండల కేంద్రంలో పద్మశాలీ భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో మాత్రమే ఆయా రాజకీయ పార్టీలకు పద్మశాలీలు గుర్తుకు వస్తున్నారని, అనంతరం పట్టించుకోవడం లేదని వాపోయారు. 50 సంవత్సరాలు దాటిన చేనేత కార్మికులకు పింఛన్ ఇవ్వాలన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు చిల్కమారి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి అలువాల రామకృష్ణ, జిల్లా కోశాధికారి పెండం రమేష్, జిల్లా పోపా అధ్యక్షుడు పరికపండ్ల అశోక్, పోపా జిల్లా ప్రధాన కార్యదరి శ్రీనువాస్ ఉన్నారు.

'ఓపెన్' పరీక్షలకు ఏర్పాట్లు చేశాం..



గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలో నంబర్లు వేస్తున్న అధికారులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలకు తగిన ఏర్పాట్లు చేశామని జిల్లా పరీక్షల విభాగం అధికారి మందుల శ్రీరాములు అన్నారు. ఆదివారం పలు పరీక్ష సెంటర్లను జిల్లా విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ.. ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశామన్నారు. ఈ నెల 25నుంచి మే 4వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లా కేంద్రంలో ఐదు పరీక్ష సెంటర్లు, తొర్రూరు పట్టణం రెండు సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్ పరీక్షలకు 4 కేంద్రాలు, టెన్త్ పరీక్షలకు మూడు పరీక్ష కేంద్రాలు కేటాయించిటన్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షకు 851 మంది విద్యార్థులు, పదో తరగతి పరీక్షలకు 653 మంది విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. కాగా సీఎస్, డీఓలు మొత్తం 14మంది పరీక్ష విధులు నిర్వహిస్తారని చెప్పారు. ప్రతీ సెంటర్‌లో రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించామన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు తప్పనిసరిగా మాస్కులు ధరించి పరీక్షలకు హాజరు కావాలన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కార్యాలయంలోని హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామని, 9490556656, 9440985729, 9849761012 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సీఎస్, డీఓలు వాసుదేవ్, విష్ణువర్ధన్ వెంకటేశ్వర్లు వీరన్న సైదులు రెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేట్ విధానాలపై పోరాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌సారథిరెడ్డి

నెహ్రూసెంటర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ మతోన్మాద, కార్పొరేట్ విధానాలపై దేశ ప్రజలు ఐక్యంగా పోరాటాలు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సీపీఐ, ఏఐటీయూసీ సంయుక్త నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం మామిండ్ల సాంబలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ పలు రాష్ట్రాలపై, ప్రజలపై దాడులు చేయిస్తుందని, ప్రశ్నించే గొంతుకలను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. దేశంలోని లౌకిక శక్తులను కలుపుకుని పోరాటం చేస్తామని తెలిపారు. కార్మికుల దినోత్సవం మేడే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కుమార్, రేషపల్లి నవీన్, వెంకన్న, రవి, చౌప్పరి శేఖర్, సందీప్, రవీందర్, లింగ్యానాయక్, చిర్ర వెంకన్న, సత్యనారాయణ పాల్గొన్నారు.

బూస్టర్ డోస్ సిద్ధం

- జిల్లాకు చేరిన 10వేల కార్బీ వ్యాక్సిన్ డోస్ వాయిల్స్
- పీహెచ్‌సీలు, ఆస్పత్రులకు పంపిణీ చేసిన అధికారులు

జిల్లాలో వ్యాక్సిన్ తీసుకున్న వారి వివరాలు..	
మొదటి డోస్	6,41,348
రెండో డోస్	6,40,332
బూస్టర్ డోస్	2,32,646

నెహ్రూసెంటర్: జిల్లాలో మళ్లీ కరోనా కేసులు నమోదవుతున్నాయి. ఈ మేరకు మొదటి, రెండో డోస్ వ్యాక్సిన్ తీసుకున్నవారికి బూస్టర్ డోస్ వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అర్హులకు వ్యాక్సినేషన్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని జిల్లా ఆస్పత్రి, పీహెచ్‌సీలకు కార్బీ వ్యాక్సిన్ డోస్ వాయిల్స్ పంపిణీ చేసి సిద్ధంగా ఉంచారు.

10 వేల డోసుల సరఫరా..

కరోనా కేసులు పెరుగుతుండడంతో ఇప్పటి వరకు మొదటి, రెండో డోస్ వేయించుకున్న వారు బూస్టర్ డోస్ వేసుకునేలా వైద్యాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాకు 10 వేల కార్బీ వ్యాక్సిన్ డోస్ వాయిల్స్ రాగా, వెంటనే ఆస్పత్రులకు పంపిణీ చేశారు. 18 సంవత్సరాలు నిండిన వారు బూస్టర్ డోస్ వేసుకోవాలని సూచిస్తున్నారు.

పెరుగుతున్న కేసులు..

జిల్లాలోని పాఠశాలలు, ఇతర ప్రాంతాల్లో కరోనా కేసులు పెరుగుతుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆస్పత్రుల్లో బెడ్లు, ఆక్సిజన్, ఇతర ఏర్పాట్లు చేసి కరోనాను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారు. కాగా జిల్లాలో ఇప్పటి వరకు 44 కేసులు నమోదు అయ్యాయని అధికారులు చెబుతున్నారు. దీంతో కరోనా జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యాక్సిన్ తప్పనిసరిగా వేసుకోవాలని సూచిస్తున్నారు.

వ్యాక్సిన్ వేయించుకోవాలి..



కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ బూస్టర్ డోస్ వేయించుకోవాలి. 18 సంవత్సరాలు నిండి మొదటి, రెండో డోస్ తీసుకున్న వారు బూస్టర్ డోస్‌కు అర్హులు. ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు వ్యాక్సిన్ వేసుకోవాలి.

-డాక్టర్ రాజ్‌కుమార్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

శ్రీభద్రకాళి ఆలయంలో ధ్వజారోహణం



అలంకరణలో శ్రీభద్రకాళి అమ్మవారు

హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీభద్రకాళి ఆలయంలో ధ్వజారోహణం నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి మూర్తిని గజపూదండలతో అలంకరి ఉదయం వృషభవాహనంపై, సాయంత్రం మృగ వాహనంపై ఊరేగించారు. శ్రీభద్రకాళి భద్రేశ్వరుల కల్యాణోత్సవానికి యాదాద్రి భువనగిరి జిల్లా బూదాన్ పోచంపల్లికి చెందిన చేనేత కళాకారులు తయారుచేసిన పట్టుచీర, ధోవతులను పద్మశాలీయులు అందజేశారు. పూజా కార్యక్రమాలకు ఉభయదాతలుగా ఉమ్మడి జిల్లా విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం, తెలంగాణ రాష్ట్ర మాతృసంఘం వారు వ్యవహరించారు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి, విశ్వబ్రాహ్మణ నాయకులు పూజలు చేశారు.



వృషభవాహనంపై అమ్మవారు



మృగవాహనంపై అమ్మవారు

ఆకేరు వాగులో పడి మహిళ మృతి


పుష్ప (ఫైల్‌)

వర్ధన్నపేట: ఆకేరు వాగులో పడి మహిళ మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌ పట్టణంలోని కరీమాబాద్‌కు చెందిన కోల పుష్ప (55) కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేది. పుష్ప భర్త చాలా సంవత్సరాల క్రితమే మృతి చెందాడు. ఈమెకు ముగ్గురు కూతుర్లు. పెంచి పెద్ద చేసి వివాహాలు చేసింది. కొంత కాలంగా పుష్ప అనారోగ్యంతో ఇబ్బందులు పడుతోంది. కాగా కూతుర్ల వద్ద తలా నెల చొప్పున ఉంటూ కాలం వెల్లదీస్తుంది. ఈ క్రమంలో ఈ నెల 19న స్వప్న ఇంటికి వచ్చింది. 20న స్వప్న తన భర్తతో కలిసి కిరాణషాపుకు వెళ్లగా పుష్ప తాను బయట కూర్చుంటానని మనుమరాలికి చెప్పి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. స్వప్న తన తల్లి కొరకు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం వర్ధన్నపేట శివారు ఆకేరు వాగులో మృతదేహం లభ్యం కాగా అక్కడికి వెళ్లి స్వప్న చూసింది. తన తల్లి పుష్ప మృతదేహంగా గుర్తించిన ఆమె వర్ధన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతురాలి పెద్ద కూతురు స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..


మహేష్‌(ఫైల్‌)

వర్ధన్నపేట: పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని దమ్మన్నపేటలో చోటు చేసుకుంది. ఎస్సై రామారావు కథనం ప్రకారం.. దమ్మన్నపేటకు చెందిన గజ్జెల్లి మహేష్‌(45) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన మహేష్‌ తాగిన మైకంలో ఈ నెల 21న పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. మహేష్‌కు భార్య మాధవి, కుమార్తె ఉన్నారు. భర్త మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని పోస్టుమార్టం చేసి తమకు అప్పగించాలని ఆదివారం మాధవి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు.

ప్రహరీ కూలి వాహనాలు ధ్వంసం

వరంగల్‌ చౌరస్తా : వరంగల్‌ 27వ డివిజన్‌ గిర్మాజీపేటలో ఆదివారం కురిసిన వర్షంతో గోల్డెన్‌ త్రిశూల్‌ ప్రైవేట్‌ పాఠశాల భవనం ప్రహరీ కూలి రెండు ఆటోలు, నాలుగు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. పాఠశాల ప్రహరీని ఆనుకొని నేరేడు చెట్టు వేర్లతో భూమిలో బాగా పాతుకపోయిందన్నారు. సమీప కాలనీకి చెందిన వారు వాహనాలను పార్కింగ్‌ చేస్తున్నారు. గత కొద్ది నెలలుగా నానుతున్న ప్రహరీ, భారీ వృక్షం వేర్లతో కూరుకపోయి నేలమట్టమైంది. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

రక్షక దళంలో నారీమణులు!

పోలీసుశాఖలో పెరుగుతున్న ప్రాతినిధ్యం

- రక్షణవనంలోశివంగులు మహిళా పోలీసులు
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో విధులు
- పురుషులతో సమానంగా సాయుధ గస్తీ.. అన్ని డ్యూటీలోనూ వారిదే హవా
- ప్రయోగాత్మక ఠాణా వెంకటాపురం...



స్టేషన్‌ ఎదుట సెంట్రీగా విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు

సాక్షిప్రతినిధి, వరంగల్‌: అసలే నక్సల్స్‌ ప్రభావిత ప్రాంతం... అక్కడ పోలీస్‌ డ్యూటీ అంటే కత్తిమీద సాము లాంటిదే.. అలాంటి ప్రాంతంలో మహిళా పోలీసులు డ్యూటీ చేయడం అంటే అసాధ్యం అంటారు. కానీ వనదేవతలు కొలువైన ములుగు జిల్లాలో మహిళా రక్షకభటులే ఆ ప్రాంతానికి రక్షణ కవచంలా మారారు. మారుమూల అటవీ ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ ఆడది అబల కాదు... కనిపించని 'నాలుగో సింహమేరా పోలీస్‌' అని నిరూపిస్తున్నారు. అన్నల ఇలాఖా ఆడ పోలీసులకు అడ్డాగా మారింది.

పురుషులతో సమానంగా...
సెంట్రీ నుంచి ఎస్‌హెచ్‌ఓ వరకు

తెలంగాణలో అధికశాతం అటవీప్రాంతం గల జిల్లా ములుగు. అడవే కాదు, నక్సల్స్‌ ప్రభావిత ప్రాంతం. వనదేవతలు సమ్మక్క సారలమ్మలు కొలువైన జిల్లాలో పోలీసులు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి. అలాంటి ప్రదేశంలో పోలీస్‌ డ్యూటీ అంటే మగవారికే ముచ్చెమటలు పడుతాయి. కానీ మహిళా పోలీసులు నిర్భయంగా పని చేస్తున్నారు. ఒకరు కాదు, ఇద్దరు కాదు కానిస్టేబుల్‌ నుంచి ఎస్సై స్థాయి వరకు 150 మంది మగవారితో సమానంగా విధులు నిర్వహిస్తున్నారు. ఏ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా రిసెప్షనిస్ట్‌, హెల్ప్‌డెస్క్‌ లో మహిళా పోలీసులు ఉండడం సహజం. కానీ వెంకటాపూర్‌లో 28 మంది పోలీస్‌ సిబ్బంది ఉంటే అందులో 22 మంది మహిళలే ఉన్నారు. జిల్లాలో మహిళా పోలీస్‌ స్టేషన్‌లేకపోయినా, వెంకటాపూర్‌ పీఎస్‌ను చూస్తే మహిళా పోలీస్‌ స్టేషన్‌ అనక తప్పదు. సెంట్రీ డ్యూటీ నుంచి ఇన్‌చార్జ్‌ ఎస్‌హెచ్‌ఓ డ్యూటీ వరకు మహిళా రక్షకభటులే నిర్వహిస్తారు. ప్రస్తుతం అందులో సగం మంది ఎస్సై పోస్ట్‌ కొట్టేందుకు కోచింగ్‌ తీసుకుంటున్నారు. ఎక్కడ ఏం జరిగినా క్షణాల్లో అక్కడికి చేరి శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజాసేవలో ముందుంటున్నారు.

సరిహద్దు ఠాణాల్లో మన మహిళా శివంగులు


ఫిర్యాదులు స్వీకరిస్తూ..

బ్యూరో ఆఫ్‌ పోలీస్‌ రీసెర్చ్‌, డెవలప్‌మెంట్‌ (బీపీఆర్‌డీ) గణాంకాల ప్రకారం 2021 జనవరి 1 నాటికి 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలను పరిగణనలోకి తీసుకుంటే.. మహిళా పోలీసుల సంఖ్యలో తెలంగాణది 25వ స్థానం. ఈ విషయంలో తమిళనాడు అగ్రస్థానంలో ఉండగా.. తెలంగాణలో ఉన్న వారు అందులో సగం కంటే తక్కువ. రాష్ట్రంలో మొత్తం పోలీసుల సంఖ్యలో 8.03 శాతం మాత్రమే మహిళలు. వీరిలో 76.5 శాతం క్షేత్రస్థాయిలోని కానిస్టేబుళ్లే. అదనపు డీజీపీలు అయిదుగురు, ఐజీలు ఇద్దరు, డీఐజీ ఒకరు, ఎస్పీలు 15 మంది, అదనపు ఎస్పీలు 19 మంది, డీఎస్పీలు నలుగురు, ఇన్‌స్పెక్టర్లు 58 మంది, ఎస్సైలు 514 మంది, ఏఎస్సైలు 214 మంది, హెడ్‌కానిస్టేబుళ్లు 280 మంది, కానిస్టేబుళ్లు 3,630 మంది ఉన్నారు. ఉమ్మడి వరంగల్‌లో అన్ని కేడర్‌లలో 8 వేలకు పైగా ఉండగా.. అందులో మహిళలు వెయ్యి మందికిపైగా ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ములుగు, జేఎస్‌ భూపాలపల్లి జిల్లాల్లోని మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ సరిహద్దు ప్రాంతాల్లో పని చేస్తుండటం విశేషం.

ఖాకీ డ్రెస్‌ పవర్‌ అంతే..



మొదట్లో పోలీస్‌ ఉద్యోగం...అందులో నక్సల్స్‌ ప్రభావిత ప్రాంతంలో డ్యూటీ అంటే భయపడ్డాం. మా పేరెంట్స్‌ కూడా వద్దన్నారు. చూద్దామని ప్రయత్నం చేసి ఉద్యోగం సంపాదించి పని చేస్తున్నా. ఇప్పుడు ధైర్యంగా ఎలాంటి టాస్క్‌నైనా ఎదుర్కునేందుకు సిద్ధంగా ఉన్నా. ఖాకీ డ్రెస్సే ఆ పవర్‌, ధైర్యాన్ని ఇచ్చింది.

- శ్రీలత, కానిస్టేబుల్‌, వెంకటాపూర్‌

ప్రజలకు సేవ చేస్తున్నామనే తృప్తి ఉంది



మహిళలు వంటింటికే పరిమితం కాదు...అవకాశం వస్తే ఎందులోనైనా రాణించవచ్చు. మా అధికారుల సూచనలు, ఆదేశాల మేరకు పగలు, రాత్రి తేడా లేకుండా ఎలాంటి పరిస్థితుల్లోనైనా విధులు నిర్వహిస్తూ సమస్యలను కూల్‌గా డీల్‌ చేస్తున్నాం. అటవీ ప్రాంతంలో డ్యూటీ అంటే భయం కంటే ప్రజలకు సేవ చేస్తున్నామనే తృప్తి ఎక్కువగా ఉంది.

- సోనీ, కానిస్టేబుల్‌, వెంకటాపూర్‌

ఎలాంటి టాస్క్‌నైనా ఎదుర్కోగలం



పై ఆఫీసర్ల ప్రోత్సాహంతో ధైర్యంగా నక్సల్స్‌ ప్రభావిత ప్రాంతంలో విధులు నిర్వహిస్తు ఎలాంటి టాస్క్‌నైనా ఎదుర్కొని ప్రజాసేవలో ముందుంటున్నాం. మహిళలు ఇంకా అన్నిరంగాల్లో రాణించలేక పోతున్నామన్న ఆలోచనలు వద్దు. వివక్షతను విడనాడి ఆడ మగ తేడా లేకుండా సమానంగా అవకాశాలు అందిపుచ్చుకుందాం.

- నిర్మల, ఆర్‌ఎస్‌ఐ, ములుగు

కుటుంబ సభ్యులు సంతోషపడుతున్నారు..



మొదట్లో పోలీసు ఉద్యోగం అంటే వ్యతిరేకించిన కుటుంబసభ్యులే ఇప్పుడు మమ్మల్ని చూసి సంతోషపడుతున్నారు. మహిళలు అనగానే వంటింటికే పరిమితం, వాళ్లేం చేస్తారంటూ నిరుత్సాహ పరిచే పరిస్థితి అంతటా పోయింది. అందరూ అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నారు. పై ఆఫీసర్ల ప్రోత్సాహంతోనే నక్సల్స్‌ ప్రభావిత ప్రాంతంలో ధైర్యంగా పని చేయగలుగుతున్నాం.

- సంధ్య, ఏఆర్‌పీసీ, ములుగు

విధుల్లో ఎక్కడా తగ్గని మహిళలు



నక్సల్స్‌ ప్రభావిత ప్రాంతంలో మగ పోలీసుల కంటే మహిళా రక్షకభటులు ఎక్కువ మంది పని చేస్తున్నారు. ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాల్సిన ప్రదేశంలో మహిళా పోలీసులు ధైర్యంగా విధులు నిర్వహించడం సంతోషకరం. పురుషులతో సమానంగా పని చేస్తూ రాష్ట్రస్థాయిలో ఆదర్శంగా నిలుస్తున్నారు.

- గౌష్‌ ఆలం, ఎస్పీ, ములుగు

పోగొట్టుకున్న ఆభరణాలు అప్పగింత


బాధితురాలికి బంగారు ఆభరణాలు అందజేస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

మహబూబాబాద్‌ రూరల్‌ : ఓ ప్రయాణికురాలు రైలులో బంగారు ఆభరణాలు పోగొట్టుకోగా వాటిని కనుగొని బాధితురాలికి జీఆర్‌పీ పోలీసులు అప్పగించిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఖమ్మం జీఆర్‌పీ సీఐ ఏ.వెంకటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం .. సికింద్రాబాద్‌కు చెందిన టి.నాగమణి గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ రైలులో ప్రయాణిస్తుంది. అనుకోకుండా రెండు బ్యాగులు తారుమారయ్యాయి. అందులోని ఒక బ్యాగులో 32 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి. ఆ బ్యాగు పోయిన విషయాన్ని గుర్తించిన బాధితురాలు కాజీపేట రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లింది. అంతలోగా మరో బ్యాగ్‌ ఉన్న వ్యక్తి ఖమ్మం రైల్వే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఇచ్చాడు. అందులో 32 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అదే రూట్‌లో ఉన్న అందరు సిబ్బంది, అధికారులను అప్రమత్తం చేశారు. ఈ సంఘటనపై కాజీపేట రైల్వేపోలీసుల నుంచి ఖమ్మం రైల్వే పోలీసులకు సమాచారం అందింది. వెంటనే కాజీపేట జీఆర్‌పీ ఎస్సై ఫిర్యాదుదారురాలిని ఖమ్మం రైల్వే పోలీస్‌స్టేషన్‌కు పంపించారు. వెంటనే ఆమెకు 32 తులాల బంగారు ఆభరణాలు గల బ్యాగును రశీదుతో సహా అందజేశారు. బ్యాగును సకాలంలో అందజేసిన గోపన్న రాంబాబు, బ్యాగు ఫిర్యాదుదారులకు చేరేలా కృషి చేసిన డోర్నకల్‌ జీఆర్‌పీ ఎస్సై శ్రీకాంత్‌, ఖమ్మం జీఆర్‌పీ ఎస్సై భాస్కర్‌రావు, కాజీపేట జీఆర్‌పీ ఎస్సై పరుశరాం, హెడ్‌ కానిస్టేబుల్‌ వెంకట్‌రెడ్డి, ఉమెన్‌ పీసీ తదితరులను ఖమ్మం జీఆర్‌పీ సీఐ వెంకటేశ్వరరావు అభినందించారు.

పదిమంది బాల బాలికలకు విముక్తి

- అక్రమ రవాణాను అడ్డుకున్న రైల్వే జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్‌, చైల్డ్‌లైన్‌
- సురక్షితంగా సంరక్షణ కేంద్రానికి తరలింపు


బాల బాలికలకు విముక్తి కల్పించిన రైల్వే పోలీసులు, చైల్డ్‌లైన్‌ కమిటీ బృందం

కాజీపేట రూరల్‌ : రైళ్లో హైదరాబాద్‌కు తరలిస్తున్న పది మంది బాల బాలికలకు ఆదివారం రైల్వేపోలీస్‌ వర్గాలు విముక్తి కల్పించారు. కాజీపేట జీఆర్‌పీ సీఐ రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన నలుగురు బాలికలు, ఆరుగురు బాలలను మధ్యవర్తి వివిధ పరిశ్రమల్లో పని చేయించేందుకు సికింద్రాబాద్‌-గుంటూరు వెళ్లే గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో తరలిస్తున్నారనే సమాచారంతో జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్‌ పోలీసులు, చైల్డ్‌ లైన్‌ బృందం వెళ్లి బాలలను అదుపులోకి తీసుకున్నారు. 14-17 ఏళ్ల లోపు వారిని అక్రమంగా పరిశ్రమల్లో పని చేయించేందుకు తరలిస్తున్న దళారులను జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్సై పరుశురాములు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలబాలికలను చైల్డ్‌వెల్ఫేర్‌ కమిటీ ఎదుట ప్రవేశపెట్టి తల్లిదండ్రులకు అప్పగించనున్నట్లు తెలిపారు. ఈ నెల 19న 34 మంది బాలలను అక్రమ రవాణను అడ్డుకొని 14 మందిపై కేసు నమోదు చేసి బాలలను తల్లిదండ్రులకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ఆర్‌పీఎఫ్‌ ఏఎస్‌ఐ రాంబాబు,చైల్డ్‌లైన్‌ టీం సభ్యులు ఎం.శృతి, బి.రవికృష్ణలను బచ్చన్‌ బచావో ఆందోళన్‌ సంస్థ రాష్ట్ర కో ఆర్డినేటర్‌ వెంకటేశ్వర్లు, చైల్డ్‌ వెల్ఫేర్‌ కమిటీ, బాలల పరిరక్షణ విభాగం బాల రక్షా భవన్‌ అధికారులు, ఆర్‌పీఎఫ్‌ సీఐ సంజీవరావు, జీఆర్‌పీ సీఐ అభినందించారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్‌


నిందితుడు విజ్జి సాయిబాబు

మహబూబాబాద్‌ రూరల్‌ : ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసి విక్రయించేందుకు తీసుకెళ్తున్న వ్యక్తిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించామని మహబూబాబాద్‌ టౌన్‌ సీఐ వై. సతీష్‌ ఆదివారం తెలిపారు. ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రిలో ఈ నెల 20న యార్వ భీమన్నకు చెందిన బైక్‌ చోరీ కాగా సదరు యజమాని టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు తనిఖీలు చేస్తుండగా స్థానిక శ్రీనివాస థియేటర్‌ సెంటర్‌లో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించగా అతడిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించారు. అంతేకాకుండా అతని వద్ద ఉన్న బైక్‌ను పరిశీలిస్తే చోరీకి గురైన వాహనం అదే అని గుర్తించారు. చోరీకి పాల్పడిన వ్యక్తి విజయవాడకు చెందిన విజ్జి సాయిబాబు.. ఆ వాహనాన్ని అమ్మేందుకు తీసుకెళ్తున్నట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు. అతడిని అదుపులోకి తీసుకుని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య


శారద మృతదేహం

మడికొండ : ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మడికొండలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం మడికొండకు చెందిన పల్లపు శారద(38), భర్త మురళి ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం ఉదయం ములుగు జిల్లా కేంద్రంలోని బంధువుల దశ దినకర్మకు వెళ్లారు. అక్కడ భార్య శారదను డబ్బులు అడుగగా డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. తిరిగి మడికొండకు చేరుకున్నాక మళ్లీ వారి మధ్య గొడవ చోటు చేసుకుంది. మనస్తాపం చెందిన శారద ఇంట్లోకి వెళ్లి వంటగదిలో చీరతో ఉరేసుకుంది. బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు లోపలికి వెళ్లి చూడగా ఉరివేసుకొని ఉండటాన్ని గమనించి వెంటనే చికిత్స నిమిత్తం 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించినట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక్క కుమారుడు ఉన్నారు. చిన్నకూతురు పూజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నర్సింగరావు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

కాటారం: తీవ్ర కడుపు నొప్పి, నరాల బలహీనత భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని వీరాపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌ తెలిపిన వివరాల ప్రకారం.. వీరాపూర్‌కు చెందిన వేమునూరి సత్తిరెడ్డి(65) గత ఏడాది కాలంగా నరాల బలహీనత, కడుపునొప్పితో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు హన్మకొండలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినప్పటికీ ఫలితం లేదు. కడుపునొప్పి తీవ్రం కావడంతో ఆదివారం తెల్లవారు జామున గ్రామశివారులోని కొత్తకుంట వద్దకు బహిర్భూమికి వెళ్లిన సత్తిరెడ్డి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహదేవపూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా పోలీసులు గ్రామానికి చేరుకోక ముందే మృతదేహాన్ని ఖననం చేయడానికి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయగా పోలీసులు అడ్డుకొని పోస్టుమార్టంకు తరలించినట్లు సమాచారం. మృతుడి కుమారుడు సాంబశివరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ లాంఛనాలతో జవాన్‌ అంత్యక్రియలు


మృతదేహాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం


మహేంద్రకుమార్‌ (ఫైల్‌)

వాజేడు: విద్యుత్‌ షాక్‌తో మృతి చెందిన జవాన్‌ తాటి మహేంద్ర కుమార్‌ అంత్యక్రియలను పోలీసుల గౌరవ వందనంతో ఆదివారం స్వగ్రామంలో నిర్వహించారు. మండల పరిధిలోని శ్రీరామ్‌నగర్‌కు మహేంద్ర కుమార్‌ కూలర్‌ను పరిశీలిస్తూ విద్యుత్‌షాక్‌కు గురై మృత్యు ఒడికి చేరిన సంఘటన పాఠకులకు విదితమే. మహేంద్ర కుమార్‌ 53 బెటాలియన్‌లో ఛత్తీస్‌ఘడ్‌ నారాయణపూర్‌ జిల్లా సోంపూర్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మహేంద్ర కుమార్‌ అంత్యక్రియలకు అక్కడి నుంచి బెటాలియన్‌కు సంబంధించిన సిబ్బంది హాజరయ్యారు. ముందుగా మృతదేహంపై జాతీయ జెండాను కప్పి ఉంచి శ్రీరామ్‌నగర్‌, చెరుకూరు, రేగులపాడు, పెద్ద గొళ్ల గూడెం గ్రామాల మీదుగా ఊరేగింపుగా తీసుకొచ్చారు. తమ సొంత పొలంలో పేర్చిన చితిపై మృతదేహాన్ని ఉంచి పోలీసులు గౌరవ వందనంగా గాలిలోకి కాల్పులు జరిపారు. అనంతరం ఖననం చేశారు.

గడ్డిగూడెం చెరువులో చేపలు చోరీ

- పోలీసుస్టేషన్‌కు చేరిన పంచాయితీ


ముదిరాజ్‌ మత్స్యకార్మికులతో కలిసి మాట్లాడుతున్న శ్రీనివాస్‌

మహబూబాబాద్‌ రూరల్‌ : మండలంలోని నడివాడ మత్స్యపారిశ్రామిక సహకార సంఘ పరిధిలోని గడ్డిగూడెం చెరువులో స్థానిక గిరిజనులు దాదాపు మూడున్నర టన్నులకు పైగా చేపలను పట్టుకొని చోరీ చేశారని తెలంగాణ ముదిరాజ్‌ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్‌ అన్నారు. చెరువులో స్థానిక గిరిజనులు చేపలు చోరీ చేసి తీసుకువెళ్తున్నారని నడివాడ ముదిరాజ్‌ మత్స్యకార్మికులు ఆ చెరువు వద్దకు వెళ్లి వారిని అడుగగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఆ పంచాయితీ రూరల్‌ పోలీసుస్టేషన్‌ కు చేరింది. జరిగిన సంఘటనపై రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ వద్ద ఆయన మాట్లాడారు. ఆదివారం ఉదయం నుంచే గడ్డిగూడెం తండాకు చెందిన గిరిజనులు చేపలు పట్టే విషయాన్ని తెలుసుకున్న ముదిరాజ్‌ మత్స్యకార్మికులు రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ కు సమాచారం ఇచ్చారన్నారు. చెరువు వద్దకు వెళితే గిరిజనులు దాడి చేస్తారని భయంతో ముదిరాజ్‌ మత్స్య కార్మికులు స్టేషన్‌ చేరుకుని ఫిర్యాదు చేశారన్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారితో పాటు ఇతర అధికారులకు సమాచారం ఇచ్చారని తెలిపారు. మత్స్యపారిశ్రామిక సహకార సంఘం చట్ట ప్రకారం, ప్రభుత్వ జీఓల ప్రకారం ముదిరాజ్‌ మత్స్యకార్మికులు చట్టానికి, న్యాయానికి లోబడి నడుస్తుండగా చట్టాన్ని, న్యాయాన్ని గిరిజనులు ఉల్లంఘించి చేపలను పట్టుకోవడం పట్ల తెలంగాణ ముదిరాజ్‌ మహాసభ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. దీనిపై పెద్ద ఎత్తున ఆందోళన చేయడం జరుగుతుందని, దోపిడీకి పాల్పడ్డ వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. ఈ విషయాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్రశాసన మండలి డిప్యూటీ చైర్మన్‌ డాక్టర్‌ బండ ప్రకాష్‌ దృష్టికి తీసుకువెళ్లి ముదిరాజ్‌ మత్స్య కారులకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. గిరిజనుల నిర్వాహకం ముదిరాజ్‌లకు రూ.3 లక్షల నష్టం కలిగిందని వివరించారు. శ్రీనివాస్‌ వెంట సంఘం అధ్యక్షుడు బచ్చలి కుమార్‌, జంగిలి బుచ్చయ్య, జంగిలి మల్లేష్‌, శ్రేణు, తిరుమలేష్‌, స్వామి, సురేష్‌, సారయ్య, నాగయ్య ఉన్నారు. జిల్లా మత్స్య శాఖ అధికారులు గడ్డిగూడెం చెరువుపై అధికారం కల్పిస్తూ స్పష్టమైన ఉత్తర్వులు ఎవరికి ఇస్తే వారే అక్కడకు వెళ్లాలని రూరల్‌ ఎస్సై రాంచరణ్‌ అన్నారు. ఇరువర్గాల వారిని పిలిపించి మాట్లాడి ఉత్తర్వులు వచ్చే వరకు ఎవరు కూడా చెరువు వద్దకు వెళ్లొద్దని చెప్పారు.

బైక్‌ను ఢీకొన్న ట్రాలీ వాహనం

- బైకిస్ట్‌ అక్కడికక్కడే మృతి


రాంరెడ్డి (ఫైల్‌)

గార్ల: ట్రాలీ వాహనం టీవీఎస్‌ బైక్‌ను ఢీకొనడంతో బైకిస్ట్‌ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కొత్త తండా సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై బానోత్‌ వెంకన్న కథనం ప్రకారం.. మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన గుండా రాంరెడ్డి(57) ఉదయాన్నే పాలు పోసేందుకు గ్రామం నుంచి కొత్తతండాకు టీవీఎస్‌ బైక్‌పై వెళ్తున్నాడు. డోర్నకల్‌ మండలం చింతల్‌తండాకు చెందిన తేజావత్‌ శంకర్‌ ట్రాలీ వాహనం అతివేగంగా ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో రాంరెడ్డి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాలీ డ్రైవర్‌ బైక్‌ను ఢీకొట్టిన విషయం ఎవరికీ చెప్పకుండా రోజూ మాదిరిగానే రాంపురం వచ్చి కూలీలను ట్రాలీలో ఎక్కించుకొని వెళ్తున్నాడు. కూలీలు రోడ్డు ప్రక్కనే రాంరెడ్డి మృతదేహాన్ని గమనించి ట్రాలీ ఆపమని కూలీలు కేకలు వేసినా ఆపకుండా ట్రాలీని తీసుకెళ్తున్నాడు. ఉదయం నీ ట్రాలీ ఈ రహదారి గుండా వచ్చినందున నువ్వే బైక్‌ను ఢీకొట్టావని డ్రైవర్‌తో వాదనకు దిగారు. ఈ మేరకు ట్రాలీని నిలిపి వేసి వెంటనే కూలీలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై సంఘటనా స్థలాన్ని సందర్శించి ట్రాలీతో పాటు డ్రైవర్‌ శంకర్‌ను అదుపులోకి తీసుకొని, రాంరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్‌ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు ఉపేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.కాగా మృతుడికి ఇద్దరు కుమారులు ఉండగా చిన్న కుమారుడు రైలు ప్రమాదంలో చనిపోగా, ప్రస్తుతం తండ్రి రాంరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

సెల్‌ఫోన్‌ పోయిందా.. అధైర్యపడకండి

- సీపీ ఏవీ రంగనాథ్‌

వరంగల్‌ క్రైం : సెల్‌ఫోన్‌ పోయిందా ..అధైర్యపడవద్దని వరంగల్‌ సీపీ ఏవీ రంగనాథ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సెంట్రల్‌ ఎక్విప్‌మెంట్‌ ఐడెంటి రిజిస్టార్‌ (సీఈఐఆర్‌)లో కొన్ని వివరాలు నమోదు చేస్తే ఫోన్‌ ఎక్కడుందో తెలుసుకునే అవకాశం ఉంటుందని సీపీ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో సెల్‌ఫోన్‌ ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైందని, ఫోన్‌ పోతే బాధపడొద్దని సూచించారు. కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన సీఈఐఆర్‌ అనే పోర్టల్‌ ద్వారా సెల్‌ఫోన్‌ పోయిన వ్యక్తి ముందుగా సంబంధిత పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి rwww.ceir.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్‌ కావాలని తెలిపారు. అందులో ఐఎంఈఐ నంబర్‌, కంపెనీ పేరు, మోడల్‌, సెల్‌ఫోన్‌ కొనుగోలు చేసిన బిల్లు తదితర వివరాలు నమోదు చేయాలన్నారు. దీంతో పాటు రాష్ట్రం, జిల్లా, మండలం, తదితర వివరాలను నమోదు చేస్తే 24 గంటల్లో ఫోన్‌ పనిచేయకుండా చేస్తుందని తెలిపారు.

అవగాహన కల్పించాలి...

ప్రతి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో సెల్‌ఫోన్‌ వాడుతున్న వినియోగదారులకు ఫోన్‌ పోతే ఏం చేయాలనే విషయాలపై, సీఈఐఆర్‌పై అవగాహన కల్పించాలని సీపీ తెలిపారు. బ్లూకోల్ట్‌, పెట్రోకార్‌ సిబ్బంది అవగాహన కల్పిస్తారన్నారు. దీంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించడానికి పోస్టర్లు విడుదల చేశారు.